ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

# ఆధునిక కవిత్వం - మానవతా దృక్పథం

**డా. సుజాత అజ్మీర**

తెలుగు సహాయక ఆచార్యులు

ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్

Article Received: 19/02/2025 Article Accepted: 24/02/2025 Published Online: 26/02/2025

DOI:10.53414/Sahithyatharangini.2025.2.1.118

**స్థూల పరిచయం:-** "మానవుడి సంక్షేమాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని సాగే రచన మానవతావాదానికి సంబంధించిన దవుతుంది. కవిత్వ దృక్పథమే మానవ సంక్షేమం. వివిధ వాదాలకు, భేదాలకు అతీతమై సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొనే కవిత మానవతావాద కవిత అవుతుంది" అని వివరించారు కలువగుంట రామమూర్తి.

ఆధునిక కవిత్వంలో మానవతా దృక్పథం పూసలలో దారం వలె అంతటా అంతస్సూత్రంగా నిక్షిప్తమై ఉంది. శాఖోపశాఖలుగా విస్తరించిన తెలుగు సాహిత్యంలో మానవీయ పరిమళాలు వెదజల్లే కవిత్వం విస్తృతంగా వెలువడింది. సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని కాంక్షిస్తూ, విశ్వమానవ సందేశాన్నిస్తూ, మానవుడుగా మనడమే మానవత అని తెలియచెప్పిన కవులు, వారి కావ్యాలు ఎన్నో ఉన్నాయి. వాటిలోని మానవతా వాద భావాలను, మానవీయ ధృక్పథం గల కవిత్వాన్ని పరిశీలించడమే ఈ పత్రం యొక్క ఉద్దేశ్యం. పత్ర పరిమితి ధృష్ట్యా ఆధునిక కవిత్వంలోని కొన్ని కవితలను పరిశీలనకు ఎంచుకున్నాను.

**కీలక పదాలు:** ఆధునిక కవిత్వం ,మానవతా దృక్పథం, సర్వమానవ.

**మానవతావాదం - ప్రాధాన్యత:**మానవతావాదులు అవలంబించే అంశాలను పరిశీలించినట్లయితే విశ్వాన్ని అవగాహన చేసుకోవడానికి సమస్యలను పరిష్కరించటానికి హేతుత్వాన్ని (Reason), విజ్ఞానాన్ని ఉపయోగిస్తారు. శాస్త్ర జ్ఞానం సాంకేతిక విధానం మానవ జీవితాన్ని మెరుగుపరచగలదని భావిస్తారు. బహిరంగమైన బహుముఖమైన సమాజాన్ని ఆశిస్తారు. అధికారయుతమైన వర్గాల నుంచి ఇతరులను అణిచివేసే అధిక సంఖ్య వర్గాల నుంచి మానవ హక్కులను

రక్షించడానికి ప్రజాస్వామ్యమే తగినదని భావిస్తారు. అభిప్రాయ భేదాలను, తగాదాలను పరిష్కరించుకోవటానికి సంప్రదింపులను, రాజీ పద్ధతులను చేపడతారు. న్యాయాన్ని నిష్పక్షపాత దృష్టిని పెంపొందించడానికి శ్రద్ధ చూపుతారు. వివక్షను అసహనాన్ని జాతి, మత, లింగ, వర్గ, వర్ణ భేదాలను సంకుచిత భావాలను తొలగించడానికి ప్రయత్నిస్తారు. మానవాళితోపాటు ఇతర పశుపక్షాది జాతులకు ప్రాధాన్యత ఇస్తారు. వ్యక్తి స్వేచ్ఛను కోరుకుంటారు. సర్వసామాన్యమైన సభ్యతా సూత్రాలను విశ్వసిస్తారు. పరోపకార భావం, నిజాయితీ, నిష్కపటం, సత్యసంధత, బాధ్యత ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని భావిస్తారు. అందరికీ వర్తించే ప్రమాణాలు రూపొందిస్తారు. నైతిక విద్య పట్ల శ్రద్ధ వహిస్తారు. హేతుత్వాన్ని కరుణను పోషిస్తారు. శాస్త్రాలను, కళలను రెండింటిని సమానంగా ఆదరిస్తారు. తమను విశ్వ పౌరులుగా భావించుకుంటూ జ్ఞాన విషయంగా నూతన అంశాల పట్ల ఉత్కంఠ ప్రదర్శిస్తారు. నవ్య భావాలను కొత్త కొత్త ఆలోచన రీతులను ఆహ్వానిస్తారు. దౌర్జన్యం, హింసా సిద్ధాంతాలను కాదని వాస్తవమైన ప్రత్యామ్నాయంగా హ్యూమనిజాన్ని ప్రతిపాదిస్తారు. ఇతరులకు సేవ చేయటం నిజమైన మానవత్వం గా భావిస్తారు. నిరాశ వాదానికి వ్యతిరేకంగా ఆశావాదాన్ని, నిస్పృహకు మారుగా విశ్వాసాన్ని, పిడివాదానికి భిన్నంగా జ్ఞానాన్ని, అజ్ఞానానికి ప్రత్యామ్నాయంగా సత్యాన్ని, ద్వేష భావం లేదా పాపానికి బదులుగా సంతోషాన్ని, భయాన్ని కాదని సహనాన్ని, ద్వేషాన్ని విడిచి ప్రేమను, స్వార్థాన్ని త్రోసిరాజని కరుణను, విరూపాన్ని తోసివేసి సౌందర్యాన్ని, అంధవిశ్వాసాన్ని విసర్జించి హేతు తత్వాన్ని మానవవాదులు విశ్వసిస్తారు, ఆదరిస్తారు. మానవులుగా సాధ్యమైనంత మంచితనాన్ని, ఉదాత్తతను సంపూర్ణంగా రూపొందించటం సమాజానికి మేలు అని విశ్వసిస్తారు.వీటన్నింటి సమాహారం గా వెలువడిందే మానవతా వాద కవిత్వం.

**మానవతా విలువలు - కవిత్వం:** మానవతా వాదాన్ని ఆంగ్లంలో హ్యూమనిజం(Humanism) గా పేర్కొంటారు. మనదేశంలో ఎం ఎన్.రాయ్ మానవతా వాద వ్యాప్తికి కృషి చేశాడు. మతమౌఢ్యానికి , విగ్రహారాధనకి వ్యతిరేకంగా, హేతువాదాన్ని బలపరిచాడు.వసుధైక కుటుంబాన్ని, సర్వ మానవ సౌభాగ్యాన్ని ఆశిస్తూ కులమత భేదాలను నిరసించాడు. వ్యక్తి స్వేచ్ఛ ఉండాలని కోరుకున్నాడు. ప్రతి వ్యక్తి విశ్వ నరుడు గా ఎదగాలని ఆకాంక్షించాడు. తెలుగు కవులు కూడా ఇదే తరహాలో తమ ఆలోచనలను,అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

నేటి ఆధునిక సమాజంలో మానవులు, ఆర్థిక రాజకీయ వైజ్ఞానిక శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధి సాధిస్తూ , నాగరికంగా పురోగమిస్తున్నా, నైతికంగా చూస్తే,

**'మాయమై పోతున్నడమ్మా, మనిషన్నవాడు**

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

**మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు'** అని విచారం వ్యక్తం చేస్తూనే, మానవీయ విలువలు గల ఉన్నత సమాజాన్ని ఆకాంక్షించారు.

కందుకూరి వీరేశలింగం సామాజిక దురాచారాలను రూపు మాపడానికి, దేశాభివృద్ధి, భాషాభివృద్ధి లక్ష్యం గా సాహిత్య కృషి చేయగా, గురజాడ -

**"యెల్ల లోకము వొక్క యిల్లై, వర్ణభేదములెల్ల కల్లై వేల నెరుగని ప్రేమ బంధము వేడుకలు కురియ"** అని సర్వ మానవ సమానత్వాన్ని, విశ్వ మానవ ప్రేమను,**"మతములన్నీ మాసిపోవును జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును"** అని,

**"చెట్టాపట్టాల్ పట్టుకొని దేశస్థులంతా నడవవలెను**

**అన్నదమ్ముల వలెను జాతులు మతములన్ని మెలగవలెను"** అని భవిష్యత్తులో మంచి సమాజాన్ని ఆశించాడు.

**"కుల మతాలు గీసుకున్న గీతల చొచ్చి**

**పంజరాన కట్టు పడను నేను ని**

**ఖిల లోకమెట్లు నిర్ణయించిన, నాకు**

**తిరుగులేదు విశ్వ నరుడ నేను"** అని 'గబ్బిలం' కావ్యం లో, మనిషి భౌతికమైన అభివృద్ధి సాధించాడు గానీ మానవత్వాన్ని మరిచిపోయాడు. మేధాశక్తి పెరిగింది కానీ హృదయం కుంచించుకుపోయింది ఈ స్థితి మానవాభ్యుదయానికి గొడ్డలిపెట్టు గా మారిందని బుద్ధికి, హృదయానికి మధ్య ఉన్న సంబంధం తెగిపోయిన పరిస్థితిని 'ముసాఫరులు' కావ్యం లో వర్ణించాడు జాషువా.

మానవ వాదం వ్యక్తి వాదం హేతువాదం ముప్పేటలా కలిసి ఉండేది మానవతావాదం. హేతువాదం అంటే ప్రశ్నించడం. మనిషి మనిషిగా బ్రతకాలని కోరుకోవడం మానవత్వం లోని ప్రత్యేకత.అటువంటి ఉత్తమ కొత్త సమాజాన్ని నిర్మించుకోవాలంటే ముందుగా భావదాస్యం పోగొట్టి హేతువాద దృష్టితో నూతన ఆలోచనలు రూపొందించుకోవాలి అని హేతువాద ప్రచారార్థమే తన సాహిత్యాన్ని సృష్టించారు త్రిపురనేని రామస్వామి. ప్రజలలో భావ విప్లవం రావాలంటే మతం పేరిట పేరుకొని పోయిన మూఢవిశ్వాసాలు పోవాలి అని **"నేడు భారత భూమిలో నిలిచి ఉన్న వర్ణముల సంకరము కాని వర్ణం ఒకటి కూడా లేదని నినదింతు గొంకు లేక"** అని కుల వ్యవస్థ పై ధ్వజమెత్తారు. మూఢ విశ్వాసాలను, సనాతన ఆచారాలను, కర్మ, విధి, తలరాత, మోక్షం అనే వాటిని ఖండించాడు.

సమాజంలోని దోపిడీ వ్యవస్థను గురించి చెప్తూ "కుటిలమతులు దేబె మొగాలు జగతిలో రెండే రెండు రకాలు" అన్నాడు కాళోజి. కుటిలమతులంటే దోపిడీదారులు, దేబె మొగాలంటే దోపిడీకి గురయ్యే వారు. ఇలా దోపిడీదారులు, దోపిడీకి గురయ్యే వారుగా ఉన్న ఈ వర్గ సమాజాన్ని అందులోని అంతరాలను నిరసిస్తూ

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

**"అన్నపురాసులు ఒకచోట ఆకలి మంటలు ఒకచోట**

**హంస తూలికలు ఒకచోట అలసిన దేహాలు ఒకచోట"** అంటూ వ్యత్యాసాలను తన కవిత్వం ద్వారా ఎత్తిచూపాడు. అంతేగాక.....

**"చెమ్మగిలని కనులు బ్రతుకు కమ్మదనము చాటలేవు**

**చెమ్మగిలని కనులుబ్రతుకు కమ్మదనం చూడలేవు**

**మన్ను కానే కాను నేను మనసు ఉన్న మానవుడను**

**మమత లేని బ్రతుకు బ్రతక విమనస్కుడ నేగాను**

**నవ్వగలను ఏడవగలను"** అని కాళోజి నా గొడవ కావ్యం లో మానవత్వాన్ని చాటుకున్నాడు.

సి.నా.రె - **"ఎట్టివానికి వాని సహనము**

**బట్టి విలువలు రెమ్మ వేయును.**

**సహనమే సంస్కృతియటన్నవ**

**చస్సు అక్షర లక్ష సేయును"** అని సహనాన్ని,

**"కత్తి యొకటే ధర్మ వీర చిహ్నము**

**కాదు సుమ్మీ ధర్మ వీరుని**

**గుండె ముందర పెను తుపాకీ**

**గుండు సైతము బెండు పోవును"** అని అహింసను గురించి పేర్కొన్నాడు. సృష్టి పరిణామ క్రమాన్ని ప్రాణకోటి పరిణామాన్ని మానవుడు తన మేధస్సుతో ప్రపంచాన్ని జయించి నాగరికతకు పునాదులు వేసిన క్రమాన్ని 'విశ్వంభర' కావ్యం ద్వారా అద్భుతంగా కవిత్వీకరించిన సి.నా.రె తన కావ్యాలన్నింటిలోనూ మానవత్వాన్ని అంతర్గతంగా ప్రతిపాదించాడు.

**"నా పేరు కవి**

**ఇంటిపేరు చైతన్యం**

**ఊరు సహజీవనం**

**తీరు సమభావనం**

**నా వచనం బహువచనం**

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

**నా వాదం సామ్యవాదం**

**కవిత్వం నా మాతృభాష**

**ఇతివృత్తం మానవత్వం"** అంటూ తన కవిత్వం లో మానవత్వానికి ప్రాధాన్యతనిచ్చాడు.

కుందుర్తి ఆంజనేయులు సత్యం, అహింస వంటి సిద్ధాంతాలను ప్రబోధించిన గాంధీజీని నేటి ప్రపంచం మరిచిపోయిందని ఆయన ప్రబోధాలకు వ్యతిరేకంగా మారి మానవత్వం కోల్పోయిందని ఆవేదనతో 'తప్పిపోయిన సత్యం' అంటూ నేటి సమాజపు వాస్తవిక దృశ్యాన్ని చిత్రించారు. నేను కూడా తప్ప తాగి ఆవేశం నిండిన కళ్ళతో తూలుతూ వచ్చి, వచ్చే ఏడు నీ జయంతి సభలోనికి ప్రవేశించి ఎవడ్రా గాంధీ అని అడగకపోతే నా పేరు మార్చి పెట్టు ఇదే నా ప్రతిజ్ఞ అంటూ కుందుర్తి సమాజంలో గాంధీయ మార్గం మరుగునపడి అవినీతి, లంచగొండితనం, ఆశ్రితపక్షపాతం, స్వార్థం, ప్రజా సంక్షేమం పట్టని రాజకీయాలు వంటి అవాంఛిత ధోరణులు పెరిగిపోతున్నాయని ఆవేదనతో సవిమర్శకంగా వాస్తవికతను చూపించారు.

అగ్ని చల్లినా, అమృతం కురిసినా అందం ఆనందం కవిత్వం పరమావధిగా భావించిన తిలక్ మానవతావాదిగా విశ్వ మానవ కారుణ్యభావంతో సామాజిక మార్పును హృదయపూర్వకంగా ఆకాంక్షించాడు. తన 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంకలనంలో మనిషి జీవితాన్ని ప్రేమించిన వాడు, జీవించడం తెలిసినవాడు, అందమైన వాడు, ఆనందమే తానైన వాడు, దుఃఖాన్ని చావుని జీవితంలో నుంచి వెళ్లిపొమ్మన్న ధీరుడు అని దుఃఖం లేని జీవితాన్ని కోరుకున్నాడు. 'ఆర్తగీతం' కవితలో నేను చూశాను నిజంగా అంటూ కనీస అవసరాలు కూడా తీరక హీనస్థితిలో ఉన్న నిరుపేద ప్రజల కష్టాలను చూసి భారతదేశపు నాగరికత ప్రపంచ ప్రసిద్ధి పొందినదని, బుద్ధుడు జన్మించిన దేశమని గర్వంగా చెప్పుకుంటున్నప్పటికీ, ఇంతటి దయనీయ జీవితాన్ని గడుపుతున్న వారు ఈ దేశంలో ఉండటం కేవలం మానవత్వం లోపించడం వల్లనే అని,నేను మానవుడిగా శిరసెత్తుకు తిరుగలేనని మానవత్వం లేని లోకాన్ని గొప్పగా ప్రశంసించలేనని ప్రకటించాడు. ఈ లోకంలో ఒక నిరుపేద ఉన్నంతవరకూ, ఒక కన్నీరు ఒలికినంత వరకూ ఒక ఆకలి ప్రేగు బాధపడినంత వరకూ, ఒక పసిపాప తల్లి దగ్గర పాల కోసం ఏడుస్తున్నంతవరకూ, ఒక తల్లి లోలోపల బాధపడుతున్నంతవరకూ ,బాధపడుతున్న ఒక పేద స్త్రీకి ఓదార్పు లభించేంతవరకూ తనకు శాంతి కలగదని ఆర్త గీతంలో ఆవేదన చెందాడు.

కరుణశ్రీ రాసిన 'పుష్పవిలాపం' కావ్యంలో కారుణ్యానికి ప్రతినిధులుగా మానవులు ఉండాలని పువ్వులను సైతం తెంపలేనంత సుకుమార సున్నిత హృదయం ఉండాలని కోరుకుంటూ

**"బుద్ధదేవుని భూమిలో పుట్టినావు,**

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

**సహజమగు ప్రేమ నీలోన చచ్చె నేమి?**

**అందమును హత్య చేసెడి హంతకుండ!**

**మైలపడి పోయెనోయి! నీ మనుజ జన్మ"** అంటూ పూజ లేకపోయినా పరవాలేదు మా పేద కుత్తుకలను కోయబోకు అని పువ్వులు చివాట్లు పెట్టినట్టుగా సుకుమారమైన భావాలను చెప్తూ మనిషి కరుణామూర్తియై,సున్నిత హృదయం కలిగి ఉండాలి అని భావించాడు.

బోయి భీమన్న 'గుడిసెలు కాలిపోతున్నై' కావ్యంలో

**"ధర్మసంస్థాపనార్థం**

**ఈ గుడిసెలు**

**మళ్ళీమళ్ళీ అంతరిస్తుంటై**

**ఈ విషవలయం సాగడం ఎంతవరకు?**

**రహస్యం గుడిసెల వాళ్లకు తెలిసే వరకు"** అని సమాజంలో అసమానతలు వ్యతిరేకిస్తూ సామాజిక అంతరాలు కూడా పోవాలని కోరుకున్నాడు.

**"బలం కలవాడు పులి**

**తెలివి కలవాడు నక్క**

**ఈ ఇరు వర్గాలకు ఆహారంగా**

**బతుకుతున్న మూర్ఖులు గొర్రెలు"** అని దళితుల స్థితి మారాలని వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

దాశరథి కృష్ణమాచార్యులు 'అగ్నిధార' కవితా సంపుటిలో

**"మానవుల నెత్తురులు త్రాగు మానవులును**

**దానవులెగాక మానవత్వం కలదే?**

**దానవుల నంతమొదింప నేను కూడ**

**రామకృష్ణ అవతార ధారణము సేతు"** అని తోటి వారికి హానిచేయడం తగదని, అటువంటి వారు శిక్షార్హులని పేర్కొన్నాడు.ఇంకా ఆరుద్ర, రాయప్రోలు సుబ్బారావు, అబ్బూరి, శేషేంద్ర, మొదలగు కవుల ఎందరో వారి కావ్య రచనలో మానవతా విలువలు ఉద్బోధించారు.

<u>**ముగింపు:**</u> పైన పేర్కొన్న కవితలు సాహిత్యంలోని మానవతా వాదానికి కొన్ని మచ్చుతునకలు.గ్రీకు తత్వవేత్త ప్రోటోగరస్ వెలిబుచ్చిన మానవాళికి మూలం (Root) మానవుడే (man is the root of mankind), మానవుని

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ప్రాతిపదికగా విలువ కట్టాలని (man is the measure of timings) ,సర్వానికి మానవుడే కొలబద్ద అని నమ్మేవారు , ఆచరించేవారు ప్రచారంలోకి తెచ్చిన వారు లెక్కకు మిక్కిలిగా ఉన్నారు. తెలుగు కవులలో ముఖ్యంగా ఎం.ఎన్.రాయ్ మానవతావాదం ద్వారా ఉత్తేజితులై సాహిత్యంలో మానవ విలువలను చేర్చి ప్రజల మనఃఫలకాల మీద ముద్రలు వేసిన వారు ఎంతోమంది ఉన్నారనడం సత్యదూరం కాదు.ఏదేమైనా మానవత్వం మిళితం చేసిన రచనలు అమరం, అద్వితీయం అనక తప్పదు.

**ఆధార గ్రంథాలు:-**

ఆరుద్ర. *సమగ్ర ఆంధ్ర సాహిత్యం.*
తెలుగు అకాడమీ. *తెలుగులో కవిత్వోద్యమాలు.*
తిలక్. *అమృతం కురిసిన రాత్రి.*
*ఎం. ఎన్. రాయ్ జీవితం.*
ద్వా. నా. శాస్త్రి. *తెలుగు సాహిత్య చరిత్ర.*